మాఫ్కరో

అడివి శివసుబ్రహ్మణ్యం

గదిలో సన్నగా వెలుగుతోంది, బెడ్ రూం లైట్.

బయట సన్నగా పన్నీరు లాంటి వానజల్లు.

ఆ గుమ్మిద వర్షానికి తలదాచుకున్న ఓచ్చగాడి మూలుగు!

• నిద్రరావటం లేదు.

కబుర్లు చెప్పుకోవటానికికూడా ఎవరూ లేరు. మా రూం మేట్ ఊరు వెడుతూ నన్ను ఆ రూంలో ప్రవేశ పెట్టి వెళ్ళాడు. నేను ఆ రూమ్‌లో చేరి, దాదాపుగా పది రోజులైంది. ఇంకా క్రొత్తదనం పోలేదు.

అప్పటివాకా చూచివచ్చిన హిందీ సినిమాలోని సంఘటనలు ఒక్కొక్కటే జ్ఞాపకం వస్తున్నాయి. ఆ సినిమా మొదట తెలుగులో తీసినదే, దానినే కొన్ని మార్పులతో చేర్పులతో హిందీలో తీశారు. రెండుకుటుంబాల మధ్యనున్న కలహాన్ని అంతరింప చెయ్యాలనే తలంపుతో భర్తతో తన బిడ్డను అనాధ అని చెప్పి మరొకరి బిడ్డను తన బిడ్డగా పెంచుకుంటుంది. తన కళ్ళముందే తన బిడ్డ పశువుల పాకలో పెరుగుతూ. పాలేరులా పొలంపనులు చేస్తూవుండటం-అన్నీ ఆమె మనస్సును చిత్రవధ చేస్తున్నా, ఆమె తన అభిప్రాయాన్ని మార్చుకోదు రహస్యాన్ని తన మనస్సులోనే దాచుకుని కుమిలిపోతుంటుంది. చక్కని నటన! సినిమా సుఖాంతం! బాగుంది. మొత్తానికి చూడదగిన చిత్రం.

ఎవరో తలుపు తట్టినట్లైంది.

నాకు నమ్మకంలేదు తలెత్తి చూచాను.

మరొకసారి తలుపు చప్పుడు!

ఈ సారి లేచి, లైటువేసి. తలుపు తీశాను:

ఒక పొడవాటి సన్నని వ్యక్తి లోనికి వచ్చి తలుపు దగ్గరగా వేశాడు. చినుకులు పడుతూనే ఉన్నాయి. బయట.

నేను ఆశ్చర్యంగా అతడి వైపు చూచాను.

"మీ పేరు సుబ్బారావు. కదూ" ఇంగ్లీషులో మాట్లాడాడు, ఆ వచ్చిన వ్యక్తి.

"అవును"... అన్నాను

"నాపేరు గౌకాడ్. నన్ను డేవిడ్‌కర్ గారు పంపించారు" అన్నాడు.

"అంటే రైల్వే టిక్కెట్ కలక్టర్ గారు.... మధ్యలోనే ఆపేశాను సందేహంగా.

"వాళ్ళమ్మాయి విజయకు మూడురోజుల నుంచి జ్వరం నిన్నటి నుంచి మన స్పృహలో లేదు. మిమల్నే కలవరిస్తోంది. ఒకసారి మిమ్మల్ని తీసుకురమ్మన్నారు.

బయట టాక్సీ వుంది'' అన్నాడతడు.

విజయ నన్ను కలవరించటం ఏమిటి? నేను ఆ రూంలోకి వచ్చిన తరువాత, ఒకటి రెండు సార్లు ఆమె నాకు గుర్తుకు వచ్చింది. అంతే!

ఆలోచించకండి ప్లీజ్, బయలుదేరండి డాక్టరుగారు కూడా మిమ్మల్ని తీసుకొని రమ్మనిచెప్పారు. అయోమయంగా పెట్టిన నా ముఖం చూచి మరొకసారి జ్ఞాపకం చేశాడతను.

నేనింకా ఆలోచించలేక పోయాను. నైట్ పైజమానైనా మార్చుకుండా పదండి అన్నాను.

ఆయన వెనకనే రూంకు తాళంవేసి, నేనూ బయలు దేరాము. బయట సిద్ధంగా వున్న టాక్సీ ఎక్కాను. అతడితో పాటుగా.

కారుతో సమానమైన వేగంతో పయ నిస్తోంది నా మస్తిష్కం.

నాకు డిఫెన్సు ఆకౌంట్స్ వారి ఆఫీసులో ఉద్యోగం లభించిన కారణంగా రెండేళ్ళ క్రితం పూనా వచ్చాను. అప్పటికి, మా బాబాయిగారు పూనాలోనే వున్నారు.

నా చిన్నతనంలో హిందీ మేష్టరుగా వున్న మా మామ్మయ్య బలవంతం వల్ల నేర్చుకున్న హిందీ, పూనాలో నా కెంతో సహకరించింది. పూనా మహారాష్ట్రంలో వున్న మరాఠీ భాషకు దరిదాపులలో నున్న హిందీ భాష రానివారు చాలా తక్కువ మంది వుంటారు. చాకలి, మంగలి, పచారీ షాపు వగైరా, అన్ని చోట్ల నాకు వచ్చిన హిందీ బాగా సహకరించేది?

పూనాలో మా బాబాయిగా రుంటున్న ఇంటికి ఎదురుగా నున్న ఇంటిలో దేవిడే కర్ అనే మరాఠీ ఆయన వుండేవాడు. రైల్వేలో టికెట్ కలక్టర్‌గా పనిచేస్తు న్నాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్ళు పెద్ద అమ్మాయి పేరు కిశోరి ఆమె బి. ఎ. చదుపుతోంది. రెండో అమ్మాయి విజయ. ఆమెకు ఐదేళ్ళు వుండగా నాకు తెలుసు. మూడు మాసాల క్రిందట మా బాబాయి గారికి ఇక్కడ నుంచి సికిందిరాబాదు ట్రాన్సుఫరుఅయి వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిపోయిన తరువాత. నాకు విజయతో పరిచయం అధికమైంది. హోటలుభోజనం నా శరీరానికి సరిపడని కారణంగా మా బాబాయిగారు వెళ్ళిన తరువాత, నేను స్వయంగా వంట చేసుకొనేవాడిని.

ఉదయాన్నేలేచి, స్నానంచేసి, కూరలు తెచ్చుకోవటానికి వెళ్ళేవాడిని. మా ఇంటికి దాదాపు ఫర్లాంగు దూరంలో వున్న మార్కెట్టుకు. అదే సమయానికి పాలవాడు వచ్చేవాడు. అందుకని నేను పాల గిన్నె విజయకు ఇచ్చి! పాలు పుచ్చుకో మని చెప్పి వెళే వాడిని నేను కూరలు తీసుకుని రాగానే ఓ మదరాసి! అని పిలిచేది. నన్ను విజయ.

1953 సంవత్సరానికి పూర్వం ఆంధ్ర రాష్ట్రం మదరాసు రాష్ట్రంలో కలసి వుండి నప్పటికీ ప్రస్తుతం ఆంధ్ర దేశం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని ఇక్కడ ప్రజలలో చాలా మందికి తెలియదు. కనుక ఆంధ్రులను కూడా మదరాసీలుగానే భావించేవారు ఇప్పటికీ చాలామంది వున్నారు ఇక్కడ.

నేను వెళ్ళి పాల గిన్నె తీసుకొని వచ్చేవాడిని.

'నేను మదరాసీని కాదు—ఆంధ్రుణ్ని' అని చెప్పేవాడిని నేను.

“నువ్వు మదరాసీ వాడివని మానాన్నగారు చెప్పారు'' అని విజయ సమాధానం.

చలాకీగా మాట్లాడుతూ చురుకుగా వుండే విజయని చూస్తే, నాకు ఆనందంగా వుండేది.

ఒక రోజు నన్ను ''మదరాసీ''—అని పిలవటం, వాళ్ళ నాన్నగారువిని విజయను మందలించారు.

''అయితే ఏమని పిలవాలి?'' అంది విజయ.

''మామా—అని పిలు'' అనిచెప్పారు

వాళ్ళ నాన్నగారు.

అప్పటినుంచీ! నన్ను "మదరాసీ" అని పిలవటం మానేసి! "మామా" అని పిలవటం మొదలు పెట్టింది.

నేను వంట చేసుకుంటుంటే, నా దగ్గరకు వచ్చి కూర్చుని కబుర్లు చెప్పేది రోజూ అప్పుడప్పుడు నాకు చపాతీలు చేసి పెట్టేది. వాళ్ళ ఇంట్లో ఏ పిండివంట చేసినా నాకు తెచ్చిపెట్టేది.

విజయ ఉదయం, సాయంకాలం నా దగ్గర కూర్చుని కబుర్లు చెప్తుంటే వాళ్ళ నాన్నగారు. వచ్చి "మా అమ్మాయి మిమ్మల్నిడిస్టర్బు చేస్తున్నట్లుంది. పాపం" అనే వారు.

"అలాంటిదేమీ లేదండీ — ఏవో కబుర్లు చెప్తుంది. నాకూ కాలక్షేపంగా వుంటోంది" అని చెప్పాను ఆయన నవ్వి వెళ్ళిపోయారు.

నేను ఏదైనా సినిమాకు వెడితే తరచుగా విజయను కూడా తీసుకొని వెళ్ళేవాడిని. విజయ చిన్నపిల్ల అయినప్పటికీ —నాతో సినిమాకు వస్తే మా ప్రక్క ఇళ్ళవాళ్ళు ఆశ్చర్యంగా చూచేవారు. వాళ్ళ నాన్నగారు మాత్రం "ఏదో చిన్నపిల్ల — మీ దగ్గర అలవాటయింది. మీకేమైనా ఇబ్బంది కలుగుతే మాత్రం చెప్పండి" అనేవారు.

నేను భోజనం చేస్తుంటే, నాప్రక్కన కూర్చుని విజయ. కబుర్లు చెప్తున్నపుడు "విజ్జు" అని పిలిచేది. వాళ్ళ అక్కయ్య. మా గుమ్మం ముందు నిలబడి.

విజయ నేను లేనని చెప్పు! అని నాకు సంజ్ఞచేసి తలుపు చాటున దాక్కొనేది. వాళ్ళక్కయ్య మరి రెండు సార్లు పిలిచాక "భౌంయ్" మంటూ బయటికి వచ్చి భయపెట్టేది. వాళ్ళక్కయ్యను.

"ఇంటికి నడు—అమ్మ అన్నం పెట్టి, నీ కోసం చూస్తోంది" అని వాళ్ళక్కయ్య ఇంటికి తీసుకొని వెళ్ళేది.

నేను వారం రోజుల పాటు మా వూరుకు వెళ్ళి వస్తే "బుద్దూ—ఎక్కడకెళ్ళేవ్ — నీ కోసం దాచి పెట్టాను ఇవి మా అమ్మ మొన్న చేసింది" అంటూ! రెండు లడ్డు వుండలు తెచ్చి నాకు ఇచ్చింది.

నాగ పంచమి ముందు రోజు రాత్రి మా రూంకు వచ్చింది. ఎడం చేతినిండా గోరింటాకు పెట్టుకుంది. ఒక చెంచాతో మరి కొంత తెచ్చి ఇదిగో చెయ్యి పట్టు—నీకు పెడతాను" అంది.

ఉహుం..నాకు వద్దు నేను నీలాగా ఆడపిల్లను కాను అన్నాను పరిహాసంగా.

'నువ్వు మగాడివే లేవోయ్ బుద్దూ! నేను పెడతా పెట్టించుకో అంది మళ్ళీ.

నేను గోరింటాకు పెట్టించుకోలేదు.

విజయ వెళ్ళిపోయింది.

తలుపు దగ్గర వేసి పడుకున్నాను.

ఉదయం వచ్చి నన్ను నిద్ర లేపింది విజయ.

"ఏయ్ బుద్ధూ! చెయ్యి చూసుకో" అంది.

నా చేతిలో గోరింటాకు.

కోపంవచ్చి కొట్టటానికి చెయ్యెత్తాను. తుర్రున పారిపోయింది. విజయ కిల కిలా నవ్వుతూ.

ఒకరోజు వుదయం నేను వంటచేసు కుంటుంటే వచ్చి కూర్చుంది. "ఇవాళ్ళ మా యింటిలో పేరంటం అంది.

"ఎందుకూ" అని అడిగాను.

"ఎందుకేమిటి శ్రావణమాసం కదూ!" అంది.

"ఓహో" అన్నాను.

"నేను సాయంకాలం చీర కట్టు కుంటాను."

"అలాగా!" అన్నాను. చారులో తిరగ మూత పెడుతూ'

బుద్దూ వింటున్నావా? నేను సాయం కాలం చీర కట్టుకుంటాను అంది మళ్ళీ.

"మరి నాకు చూపిస్తావా?" అని అడిగాను.

"మరి —?" సాయంకాలం పెంద రాళే వచ్చేసెయ్యి ఆఫీసునుంచి "అంది"

"అలగే" అన్నాను.

"అల్లాగే కాదు-తప్పకుండా రావాలి."

"ఓ—తప్పకుండాను" అని చెప్పాను

ఆ సాయంకాలం విజయకు చెప్పిన ట్లుగానే! అరగంట ముందుగా ఆఫీసునుంచి వచ్చాను.

నేను గదితాళం తీస్తుంటే చూసింది కాబోలు—నేను కాళ్ళుకడుక్కుని బట్టలు మార్చుకునే సరికి, విజయ వచ్చింది.

చీర కట్టుకుంది—లేత పీలంరంగు నైలాన్ చీర ఆకు పచ్చరంగు క్రేపు సిల్కు జాకెట్టు —ఎంతోనిండుగా చూడ ముచ్చటగా వుంది.

"ఇదిగో చీర. చూడు—బాగుందా?" అని అడిగింది.

"బ్రహ్మాండంగా వుంది — నిన్ను చూస్తుంటే నాకు నిన్నే పెళ్ళిచేసుకోవాలని పిస్తోంది." అన్నాను. నవ్వుతూ.

"ఆడపిల్లలంతా గోరింటాకు పెట్టుకుం టారు. నువ్వూ పెట్టుకున్నావుగా నిన్నెవరు పెళ్ళి చేసుకుంటారు?" కిలకిలా నవ్వింది విజయ

"ఓహో! అయితే నేనే ఓడిపోయాను" అన్నాను. బుర్రగోకుంటూ.

"అలారా దారికి! ఇవాళ్ళ పేరంటా ళ్ళందరికీ కాఫీ ఇస్తున్నాం, మా ఇంట్లో" అంది.

"మరి నాకో?" అన్నాను

' మరచిపోయాను. నువ్వు ఆడపిల్లవే కేదూ: తెస్తానుండు" నా మాట వినిపించు కుండా ఇంటికి పరిగెత్తింది.

అయిదు నిమిషాలలో కాఫీతో తిరిగి వచ్చింది.

నేను కాపీతాగేశాక నా చొక్కానిండా సెంటు రాసింది, వద్దంటున్నా వినిపించు కోకుండా.

"మా పేరంటాలందరికి వసుపుకూడా పూస్తాం మరి, నీకు పూయనా? అంది.

"వద్దులే బాబూ! ఈ మర్యాద వాలు" అన్నాను.

"ఇంకా పేరంటాలు ఇంట్లో వున్నారు. వస్తా" అంటు లేడిపిల్లలా పరుగు తీసింది.

సుమారు. పదిహేను రోజుల క్రిందట ఒక స్నేహితుడి దగ్గర నుంచి 'బుల్‌బుల్ తెచ్చాను. నాకు చేతనైనంత వరకు వాయించి కొన్ని పాటలు వినిపించాను విజయకు.

'నేను గూడా వాయించి చూస్తాను" అంది.

"వద్దు. ఇది నాది గాదు. నా మిత్రుడిది" అని చెప్పాను.

అదే సమయానికి మరొక మిత్రుడొస్తే వీధిలోకి వెళ్ళి ఐదు నిముషాలు మాట్లాడి వచ్చాను. నేను తిరిగివచ్చి చూసేసరికి బుల్ బుల్‌కు వున్న మూడు తీగలలోనూ ఒక తీగ తెగివుంది.

"ఎందుకు తెగింది?" అన్నాను కోపంగా.

"వాయిస్తుంటే తెగిపోయింది," అంది విజయ జాలిగా ముఖం పెట్టి.

"వాయించవద్దని చెప్పానుగా."

"పోనీలే. నేనొక తీగను కొనిస్తాను" అంది విజయ.

గర్వంతో కూడిన ఆ సమాధానం

వచ్చేసరికి నాకు మరింత కోపం వచ్చింది.

"అసలు నీకు చనువియ్యటం నాదే తప్పు. ఈసారి గదిలో ఏ వస్తువూ ముట్టుకోకు' అన్నాను. అంత కఠినంగా ఎలా మాట్లాడానో!

విజయకు కూడా కోపం వచ్చినట్లుంది.

అక్కడనుంచి లేచి ఇంటికెళ్ళిపో

యాంది.

ఆ మరునాడు నేను ఆఫీసునుంచి వచ్చి తలుపు తీసి, ఆ రోజు వచ్చిన వుత్తరం తీసుకున్నాను. ఆ ప్రక్కనే వున్న 'బుల్ బుల్' తీగ చూసాను. అకారణంగా విజయను బాధపెట్టానే అనిపించింది. విజయ చేసిన పని తప్పే అయినా, అంత చిన్న విషయానికి అంత కఠినంగా మాట్లాడి వుండకూడదనుకున్నాను.

ఆ తరువాత ఆ యింట్లో వున్నది వారం రోజులే! ఆ వారంరోజులలో విజయ నన్ను చూసి ముఖం ప్రక్కకు తిప్పేసుకునేది.

మా మిత్రు డొకడు తనతోపాటుగా వుండమంటే, అతడి రూం ఆఫీసుకు దగ్గరలో వున్న కారణంగా అతడి రూంలో ప్రవేశించాను. ఇంకా పది రోజులు కాలేదు.

ఈ గతం అంతా గుర్తుచేసుకునేసరికి విజయపట్ల కఠినంగా ప్రవర్తించినందుకు నా మీద నాకే కోపం వచ్చింది.

టాక్సీ నడుస్తూనే వుంది. దూరంగా ప్రసూతిహాస్పిటల్ కనుపిస్తోంది. మరొక పది నిముషాల్లో రాస్తాపేటలోని విజయ ఇంటికి చేరుకోగలిగాను. పది నిమిషాలు నా మనస్సుకు పది యుగాలుగా గడిచాయి.

రాస్తాపేట వచ్చింది. మూడు రోడ్లమధ్య వున్న ఆంజనేయ స్వామివారి ఆలయం - కొంచెం ముందుకు పోయాక, సదరన్ మీల్సు హోటల్ ఇంకా ముందుకు వెళ్లాక ఒక మలుపు - మలుపు తిరిగి కొంచెం దూరం నడచి, టాక్సీ ఆగిపోయింది. చేతినున్న వాచీ చూచుకొన్నాను.పన్నెండు గంటలైంది. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి.

దగ్గరనే వేసియున్న తలుపు త్రోసుకుని లోపలికి వెళ్ళాను. మంచంమీద పడుకునుంది విజయ. ఆ ప్రక్కనే కుర్చీమీద వాళ్ళ నాన్న, కొంచం దూరంలో వాళ్ళ అమ్మ, వాళ్ళక్కయ్య మరొక మంచం మీద కూర్చున్నారు. వాళ్ళమ్మ చీరచెంగుతో కళ్లు తుడుచుకుంటోంది.

నన్ను చూడగానే వాళ్ళ నాన్నగారు లేచి "నమస్తే! వచ్చారా? కూర్చోండి" అని కుర్చీ చూపించారు.

"అమ్మాయి, విజ్జా! మామ వచ్చాడమా మద్రాస్ మామ, చూడు" అన్నారు, లోతుకు పోయిన కళ్ళు, వీరసించిపోయిన శరీరం. ఆ పరిస్థితిలో విజయను చూస్తే నా కళ్ళు చెమ్మగిల్లాయి.

విజయ నెమ్మదిగా కళ్ళు తెరచింది. తలత్రిప్పి నా వైపు చూచింది "నేను వచ్చానమ్మా విజయా" అన్నాను.

విశాలమైన విజయ కళ్ళు ఒక క్షణం మెరిశాయి. కేకలేపి కూర్చోపెట్టాను.

విజయ ఒక్కసారి చూచింది నా వైపు.

"నాకేం కోపం లేదమ్మా. నీ మీద" అన్నాను. విజయ తల మీద నా చేతిని వుంచి ఓదార్పుగా.

విజయ కన్నీటితో "మామా—మాఫ్ కరో" అంటూ నా వడిలో వాలి పోయింది.